క్లుప్తంగా

విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్, హెచ్‌ఎం

సారంగాపూర్: పదో తరగతి విద్యార్థులు ఇంటర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని అధ్యాపకులు అన్నారు. మండలంలోని రేచపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి సారంగాపూర్ కళాశాలలో చదవాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ కళాశాలగా ఎంపికైయిందని, దానికి అనుగుణంగా ఫలితాలు వచ్చాయని, వచ్చిన ఇంటర్ ఫలితాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొంక వేణు, హెచ్‌ఎం బోగ మధుసూధన్, అధ్యాపకులు రాజు, రాజేందర్, వెంకటేశ్వర్లు, సతీశ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న కిషన్

పెగడపల్లి: మండలంలోని వెంగళాయిపేట శివాలయం అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చెట్ల కిషన్ విరాళంగా రూ.లక్ష సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కిషన్ కుటుంబ సభ్యులు అమ్మమ్మ, తాత గురిజల నర్సమ్మ–పెద్ద మల్లయ్య జ్ఞాపకార్థం రూ. 50 వేలు, నానమ్మ, తాత చెట్ల అక్కమ్మ–రాజయ్య జ్ఞాపకార్థం రూ. 50 వేల చొప్పున మొత్తంగా రూ. లక్షను విరాళంగా అందజేసినట్లు కమిటీ చైర్మన్ కొండాల్‌రావు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

గొల్లపల్లి: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి కరాటే, కుంగుపూ పోటీల్లో మండలంలోని మల్లన్నపేటకు చెందిన 8 మంది విద్యార్థులకు బంగారు,వెండి,కాంస్య పతకాలు దక్కినట్లు గ్రాండ్ మాస్టర్ హరికృష్ణ, మాస్టర్ చిరంజీవి తెలిపారు.అండర్–14 విభాగంలో కటాల సంజన, భవ్యశ్రీ,అనుశ్రీ గోల్డ్ మెడల్ సాధించారు. మధుశ్రైని,ప్రణీత, సిల్వర్ మెడల్ సాధించగా, అక్షయ, కార్తీక, రియా కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. వీరిని ఎంఈవో జమునాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు.

మహిళలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలి

జగిత్యాలరూరల్: మహిళా సంఘాలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని జగిత్యాల రూరల్ ఎంపీడీవో రమాదేవి, అర్బన్ ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. సోమవారం మండల సెర్ప్ కార్యాలయంలో మండల సమాఖ్య వీవోఏల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘాలు ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని, రెండు మండలాలు బ్యాంకు లింకేజీ రుణాల్లో 100 శాతం ప్రగతి సాధించడం అభినందనీయమన్నారు. మహిళలు స్వయం ఉపాధితో కుటుంబానికి అండగా నిలువాలన్నారు. అనంతరం ఎంపీడీవోలను మహిళలు సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, సీసీలు రవీందర్, శ్రీనివాస్, గంగారాం, మండల సమాఖ్య అధ్యక్షురాలు సత్తవ్వ, గంగాభవాని పాల్గొన్నారు.

ఆలయ అవినీతిపై చర్యలు తీసుకోండి

కొండగట్టు: కొండగట్టు అంజన్న ఆలయంలో అవినీతి పేరుకుపోయిందని, వాటిపై చర్యలు తీసుకోవాలని హిందూవాహిని నాయకులు ఆదివారం ఆలయ ఏఈవో అంజయ్యకు వినతిపత్రం అందించారు. అధికారులు, పాలక మండలి తీరుతో ఆలయ ప్రతిష్ఠ దిగజారుతోందని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ఐదేళ్ల సర్వీసు దాటిన ఉద్యోగులను బదిలీ చేయకపోవడంతో దొంగతనాలు పెరుగుతున్నాయని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు సురేందర్, భార్గవ్, వాసు, వికాస్ ఉన్నారు.

ఘనంగా శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజల్లో భక్తులు



బండ్లపోటీలు ప్రారంభిస్తున్న చైర్మన్,ఎస్సై

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేటలో సోమవారం శ్రీ లక్ష్మీవెంకటేశ్వర ఆలయ వార్షికోత్సవ, జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను నేటి నుంచి 28 వరకు నిర్వహించనున్నారు. 28న స్వామి కల్యాణం, జాతరను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతర ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి సుప్రభాతం, గత స్థాపిత దేవతార్చన నిత్యహోమం, బలిహరణం, తీర్థప్రసాద వినియోగం, దేవిపూజ, శోభాయాత్రలను అర్చకులు మాధవచార్యులు నిర్వహించారు. ఉత్సవాల్లో ఎంపీటీసీ ఓస సత్తెమ్మ, మాజీ సర్పంచ్ వనతడుపుల నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

చిట్టాపూర్‌లో మల్లన్న జాతర..

మండలంలోని చిట్టాపూర్‌లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ జాతర మహోత్సవంలో స్వామి వారి కల్యాణం, హోమం, పూర్ణాహుతి, మహా అన్నదానం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మైస లక్ష్మి, ప్యాక్స్ చైర్మన్ నేరేళ్ల మోహన్‌రెడ్డి, నాయకులు కడకుంట్ల సాయికుమార్, ఆలయ కమిటీసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జాతరలో ఎడ్లబండ్ల పోటీలు

వెల్గటూర్: మండలంలోని స్తంభంపల్లిలో శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ముగింపు రోజు ఆరో రోజు ఎడ్లబండ్ల పోటీలు ఆకట్టుకున్నాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పోటీలను తిలకించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం ఇరవై బండ్లు పాల్గొన్న పోటీల్లో గొల్లపల్లికి చెందిన బంగుటపు ఆరాధ్య మొదటి బహుమతిగా పావుతులం బంగారం, జగదేవుపేటకు చెందిన మెట్‌పల్లి అజయ్ రెండో బహుమతిగా 8 తులాల వెండి, సీతారాంపల్లికి చెందిన సోమిశెట్టి భీమన్న, రాములపల్లికి చెందిన నీలం ఆనందిని మూడో బహుమతిగా 4 తులాల వెండి గెలుచుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పాకాల నరేశ్, ఎంపీటీసీ పొడేటి సతీశ్, ఎస్సై ఉమాసాగర్, దుబ్బస్వామి, యాగండ్ల గంగయ్య, కాశ శ్రీధర్, గొంటి కిరీటి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దళితుల ఇళ్ల నిర్మాణానికి రూ.ఆరు లక్షలు



భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, జెడ్పీచైర్‌పర్సన్

రాయికల్: దళితులు ఇళ్లు నిర్మించుకుంటే గృహలక్ష్మి కింద రూ.ఆరు లక్షలు ఇస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఇటిక్యాలలో అంబేద్కర్ యువ సంఘం భవనాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా రాయితీ రుణాలు ఇచ్చిందో.. ఇప్పుడు అలాగే మంజూరు చేస్తామని పేర్కొన్నారు. సంఘం భవనానికి రూ.ఐదు లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ దళితులకు దళితబంధు పథకం ప్రవేశపెట్టి ఉపాధి కల్పించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, మాజీ సర్పంచ్ సామల్ల లావణ్య, రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, ఎంపీటీసీ రాధ, సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహబంధాలు

క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్‌పర్సన్ అన్నారు. పట్టణంలో భీమన్న జాతర సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. జిమ్ ఏర్పాటుకు రూ.ఐదు లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ ప్రకటించారు.

వేంకటేశ్వరశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ

జగిత్యాలటౌన్: పట్టణంలోని గోవింద్‌పల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సోమవారం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు జీవన్‌రెడ్డికి ఆశీర్వచనాలు అందజేశారు. ఆయన వెంట కొలగాని మధుసూదన్ తదితరులు ఉన్నారు.

రూరల్ ఎంపీపీకి తీవ్ర పోటీ

- ఎంపీటీసీలతో ఎమ్మెల్యే సమావేశం
- ఇద్దరి మధ్య తీవ్ర పోటీ

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ ఎంపీపీ ఎన్నిక ఈనెల 28న నిర్వహించనున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 11 మంది సభ్యులను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఏకాభిప్రాయానికి తీసుకువచ్చారు. ఎంపీపీ పదవికి నర్సింగాపూర్ ఎంపీటీసీ మహేశ్, పోరండ్ల ఎంపీటీసీ అరే సౌజన్య పోటీ పడుతున్నారు. దీంతో వారిద్దరూ ఎంపీటీసీలను కలిసి, తమకే మద్దతు పలకాలని ఒత్తిడి పెంచుతున్నారు. సోమవారం ఈ విషయం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు తెలియడంతో సాయంత్రం మళ్లీ ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏకాభిప్రాయం తీసుకవచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తుండగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదుగురు ఎంపీటీసీలు, బీజేపీకి చెందిన ఒక ఎంపీటీసీ సభ్యుడు మంతనాలు జరుపుతుండటం చర్చనీయాంశగా మారింది. ఎన్నిక ఈ నెల 28న ఉదయం 11 గంటలకు జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నారు.

బీసీ జనరల్‌కే కేటాయించాలని ఒత్తిడి

ఎంపీపీ పదవి బీసీ జనరల్‌కు రిజర్వేషన్ రాగా, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన చల్‌గల్ ఎంపీటీసీ గాజుల గంగారాం ఎంపీపీగా ఎన్నికయ్యారు. కానీ ఆయన మృతి తర్వాత వైస్ ఎంపీపీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలు నిర్వహించి బీసీలకు ఎంపీపీ పదవి అందేలా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆదేశాలు తీసుకవచ్చారు. దీంతో ఎంపీపీ పదవి కోసం ఎదురు చూస్తున్న బీసీ ఎంపీటీసీలు తమకే ఎంపీపీ పదవి ఇవ్వాలని పోటీ పడుతున్నారు.

ఆడబిడ్డల పెళ్లికి భారం కావొద్దనే కల్యాణలక్ష్మి

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లిరూరల్: పేదింటి ఆడబిడ్డల వివాహానికి భారం కావొద్దనే బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అధినేత కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటించి పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనను ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని,దేశంలో ఎక్కడలేని విధంగా సంక్షేమ పథకాలను కేసీఆర్ అమలు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ సాయిరెడ్డి,బీఆర్‌ఎస్ నేతలు,తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు ఎమ్మెల్యే మొక్కులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని కొజన్‌కొత్తూర్, కేశాపూర్ గ్రామాల్లో జరుగుతున్న మల్లన్న జాతర ఉత్సవాల్లో సోమవారం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎమ్మెల్యే తనిఖీ

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి పట్టణ శివారులోని వెంకట్రావుపేట మహాత్మా జ్యోతిబాపులే బాలికల పాఠశాలను సోమవారం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం,పాఠ్య పుస్తకాలు తదితర విషయాల్లో ఏమైనా ఇబ్బందులున్నాయ అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ప్రిన్సిపాల్ ఆనందం,తదితరులు పాల్గొన్నారు.

ఏం సాధించావని విజయ సంకల్పయాత్ర?



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కొండగట్టు: ఏం సాధించావని విజయసంకల్ప యాత్ర చేస్తున్నావని ఎంపీ బండి సంజయ్‌ను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రశ్నించారు. కొడిమ్యాలలో సోమవారం మాట్లాడారు. నిర్వహించారు. అబ్బదపు హామీలు, కుల మతాల పేరు చెప్పుకుని కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అధికారంలోకి వచ్చాయన్నారు. 10 ఏళ్ల అధికారంలో ఉన్న బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ బండి సంజయ్ జిల్లాకు ఏం తీసుకు వచ్చాడో, చెప్పుకుంటూ ప్రజా (విజయ) సంకల్ప యాత్ర చేయాలని డిమాండ్ చేశారు. హిందు పార్టీగా చెప్పుకునే బీజెపి పార్టీ తెలంగాణలో ఎన్ని దేవాలయాలకు ఎన్ని నిధులు ఇచ్చారో చెప్పాలన్నారు. కరీంనగర్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత వినోద్‌కుమార్‌కే ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పర్లపెల్లి ప్రసాద్,నాయకులు పునుగోటి కృష్ణారావు,పులి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివ దీక్షాపరుల శోభాయాత్ర



కథలాపూర్: మండలంలోని పోతారం గ్రామంలో శివదీక్షాపరులు సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. పల్లకిలో శివుడి చిత్రపటాన్ని ఉంచి అన్ని వాడల్లో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. దీక్షాపరులు ఆట, పాటలతో సందడి చేశారు.

హుండీ ఆదాయం రూ.10లక్షలు



కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం నల్లగొండ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ హుండీలను సోమవారం అధికారుల సమక్షంలో లెక్కించారు. నెల రోజులకు గాను రూ.10.90 లక్షలు వచ్చినట్లు ఈవో అనూష తెలిపారు.స్పెషల్ ఆఫీసర్ రవి కిషన్, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

ఈజీఎస్ అవకతవకలపై ఫిర్యాదు

మెట్‌పల్లిరూరల్: ప్రభుత్వం నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో నిర్లక్ష్యం వహించి, ఉపాధిహామీ పథకంలో అవకతవకలకు పాల్పడ్డారని మెట్‌పల్లి మండలం మేడిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి రవళి,ఉపాధి హామీ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ సుమన్‌లపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన తరి మల్లికార్జున్ అనే వ్యక్తి కలెక్టర్ యాస్మిన్‌భాషకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి విన్నవించారు .ఉపాధిహామీ పథకంలో చేయని పనులకు పలువురి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమచేశారని, అలాగే గల్ఫ్‌లో ఉన్న వారి ఖాతాల్లో కూడా డబ్బులు వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.కార్యదర్శి,కంప్యూటర్ ఆపరేటర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయాల అభివృద్ధికి కేంద్రం కృషి

మల్లాపూర్: ఆలయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సురభి నవీన్‌కుమార్ అన్నారు.మండలంలోని చిట్టాపూర్‌లో శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, మాజీ ఉపసర్పంచ్ అబ్బురి నవీన్‌గౌడ్, శక్తికేంద్రాల ఇన్‌చార్జి అంజిరాజ్ , బూత్ అధ్యక్షుడు కుంట జీవన్‌రెడ్డి, ఆరెళ్ల బుజ్జిగౌడ్, గుజ్జెరి విజయ్, పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలి

పెగడపల్లి: తెలంగాణ హరితహారంలో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వననర్సరీల్లో లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని దోమలకుంట, ఆరవెల్లి, నామాపూర్ తదితర గ్రామాల్లోని వన నర్సరీలను సోమవారం సందర్శించి మొక్కల పెంపకం చేపట్టిన తీరు, వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 23 గ్రామాల్లో 1.65 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్, ఏపీవో అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆరోగ్యమైన సమాజంతోనే దేశాభివృద్ధి

మల్లాపూర్: ఆరోగ్యమైన సమాజంతోనే దేశాభివృద్ధి సాధ్యమని ప్రముఖ వైద్యుడు కండ్లి నరేశ్ అన్నారు. మండలంలోని రాఘవపేటలో సోమవారం నరేశ్ మల్టీస్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరాన్ని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. వైద్యశిబిరంలో 200మంది రోగులను పరిక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నత్తి లావణ్య, నాయకులు నత్తి నర్సయ్య, ఎండీ.అమిన్, బోయిని సిద్దయ్య, బైరి రవికుమార్‌యాదవ్, ఆస్పత్రి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కో ఆప్షన్ సభ్యుడు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు పన్నాల మాధవరెడ్డి సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు మాధవరెడ్డికి పార్టీ కండువా కప్పి కాంగ్రెలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ వల్లే అభివృద్ధి, సంక్షేమ పథకాలు సాధ్యమని అందుకే పార్టీలో చేరినట్లు స్పష్టం చేశారు.

క్రికెట్ లీగ్ విజేత ముత్యంపేట



ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల: మండలంలో వన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్రికెట్ లీగ్ ఫైనల్ మ్యాచ్‌లో ముత్యంపేట విజేతగా నిలువగా, గంగాధర టీం రన్నరప్‌గా నిలిచింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విజేతగా నిలిచిన ముత్యంపేట టీంకు ట్రోఫీ అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఫ్రెండ్ షిప్ క్రికెట్ టోర్నమెంట్ విజేత తొంబరావుపేట

మేడిపల్లి: భీమారం మండలంలోని మన్నెగూడెంలో నిర్వహిస్తున్న ఫ్రెండ్ షిప్ క్రికెట్ టోర్నమెంట్‌లో నాలుగు మండలాలకు చెందిన 38 టీం ల క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో తొంబరావుపేట రన్నర్ గా నిలవగా, విన్నర్ గా కట్లకుంట జట్టు గెలుపొందింది. జట్లకు ముఖ్య అతిథులు ఎస్.రెడ్డి, గంట శంకర్ బహుమతులు, అవార్డులు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మ్యాదర్ రమేశ్, సూర్యం, క్రీడాకారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

తాగునీటి సమస్యలు రాకుండా చూడాలి

కథలాపూర్: ఈ వేసవిలో గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని ఎంపీపీ రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. గ్రామాలవారీగా ప్రస్తుతం ఉన్న నీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు గ్రామాల్లో పైపులైన్ లీకేజీ సమస్య ఉన్నట్లు ప్రస్తావించడంతో త్వరగా మరమ్మతులు చేయించాలని అధికారులకు సూచించారు. ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో శంకర్, ఎంపీవో తౌఖిర్‌అహ్మద్ పాల్గొన్నారు.

నేడు ఇబ్రహీంపట్నం మండల సర్వసభ్య సమావేశం

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 నిమిషాలకు ఎంపీపీ జాజాల భీమేశ్వరీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆటో బైక్ ఢీ, ఒకరికి గాయాలు

మల్యాల: మండల కేంద్రంలో బైక్ అదుపు తప్పి, ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్న సంఘటనలో ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. జగిత్యాల మండలం అంతర్గాం గ్రామానికి చెందిన రవి అనే వ్యక్తి మండల కేంద్రంలోని బ్లాక్ చౌరస్తా సమీపంలో బైక్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొని కిందపడి స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో జగిత్యాల ఆస్పత్రికి తరలించారు.

ఇసుకడంపులకు వేలం

మల్లాపూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఇసుక డంపులకు వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వీర్‌సింగ్ తెలిపారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నామన్నారు. సుమారు 10 ట్రిప్పుల ఇసుకను మంగళవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలానికి ప్రకటన జారీ చేశామని తెలిపారు. ఈ వేలంపాటలో పాల్గొనే వ్యక్తులు రూ.5వేల డిపాజిట్ జమా చేసి రశీదు పొంది పాల్గొనాలని సూచించారు.

బీసీ సంక్షేమ సంఘం డివిజన్ అధికార ప్రతినిధిగా రాజేశ్

ఇబ్రహీంపట్నం: బీసీ సంక్షేమ సంఘం మెట్‌పల్లి డివిజన్ అధికార ప్రతినిధిగా మండలంలోని అమ్మక్కపేట గ్రామానికి చెందిన బాలేరావు రాజేశ్‌ను నియమించినట్లు జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడు నల్ల వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం నియామక పత్రాన్ని రాజేశ్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు బొమ్మల శంకర్, మామిడల శిరిష్‌కుమార్, ఆవుల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు సామగ్రి వితరణ

సారంగాపూర్: మండలంలోని కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్ట్రీట్ కాజ్ (ఎన్‌జీవో) వీఎస్‌ఆర్ వీజేఐటీ స్వచ్ఛందసంస్థ రూ. 1 లక్ష విలువ చేసే పాఠశాలకు అవసరమైన సామగ్రిని అందించింది. విద్యార్థులకు టేబుళ్లు, కుర్చీలతో పాటు, అవసరమైన అధునాతన విద్యా బోధన పరికరాలను అందించారు. వీఎస్‌ఆర్ వీజేఐటీకి హైదరాబాద్‌కు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులు స్వచ్ఛందసేవా సంస్థగా ఏర్పడి దేశంలోని పలు ప్రముఖ నగరాల్లో పలు ఈవెంటలను చేస్తు వచ్చిన సొమ్మును పేదవారికి, ప్రభుత్వ పాఠశాలలకు, ప్రజలకు అవసరమైన కార్యక్రమాలకు చాలా ఏళ్లుగా ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్ట్రీట్ కాజ్ ప్రతినిధులు నైనిక, సుహాస్,హరివరణ్, హెచ్‌ఎం జానకి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

పెగడపల్లి: మండలంలోని దోమలకుంటలో ఉపాధిహామీలో రూ.10 లక్షల సీసీరోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ షంశేర్ అలీ, కార్యదర్శి విష్ణువర్ధన్ నాయకులు పాల్గొన్నారు.

మార్చి 5న చక్కెర ఫ్యాక్టరీ సందర్శన

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం నియమించిన శాసనసభా సంఘం మార్చి 5న ముత్యంపేట చక్కెర కర్మాగారాన్ని సందర్శిస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సభ్యులుగా ఉన్న సభా సంఘం ఫ్యాక్టరీని సందర్శిస్తుందని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్లకు పాత పద్ధతిలోనే ప్రమోషన్ కల్పించాలి

జగిత్యాల: అంగన్‌వాడీ హెల్పర్లకు పదో తరగతి అర్హత ఆధారంగా ప్రమోషన్లు ఇవ్వాలని అంగన్‌వాడీ హెల్పర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించడం హర్షనీయమని, దీనికి ఇంటర్ అర్హత పేర్కొనడం సరికాదన్నారు. అంగన్‌వాడీ హెల్పర్లు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు శిక్షణ సర్టిఫికెట్ల అందజేత

జగిత్యాల: వాల్మీకి ఆవాసం–సేవాభారతి జగిత్యాల ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ కేంద్ర ప్రాంత సేవా ప్రముఖ్ శివశంకర్, ప్రాంత సేవాభారతి ప్రముఖ్ శ్రీవాసు, రామాచారి పాల్గొని 3 నెలలు కుట్టుమిషన్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు.

రాష్ట్రస్థాయిలో విద్యార్థికి ప్రథమ స్థానం

రాయికల్: మండలంలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఖలీల్ రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించిన్నట్లు ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్ రెడ్డి సోమవారం తెలిపారు. హైదరాబాద్ అనురాగ్ యూనివర్సిటీలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ స్పెల్ విజార్డ్ విభాగంలో ప్రతిభ కనబర్చింది ప్రథమ స్థానంలోనిలిచారు. ఈ సందర్భంగా ఖలీల్ ను హెచ్‌ఎం వేణు గోపాల్ రావు,ఉపాధ్యాయులు అభినందించారు.

వైద్యాధికారి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల:జాతీయ ఆరోగ్య మిషన్ కింద కాంట్రాక్టు పద్ధతిన బస్తీ దవాఖానాల్లో వైద్యాధికారిగా పనిచేయడానికి ఎంబీబీఎస్ అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 28న జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరుకావాలని అధికారులు పేర్కొన్నారు. ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలని కోరారు.

మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ పోస్టుల ఖాళీలు

జగిత్యాల: జాతీయ ఆరోగ్య మిషన్ కింద కాంట్రాక్టు ప్రతిపాదికన మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవడైర్స్ పోస్టులు 28 ఖాళీలు ఉన్నాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను నిబంధనలకు లోబడి ఆహ్వానిస్తున్నట్లు పేర్కొంది. దరఖాస్తు ఫారం, నోటిఫికేషన్ వివరాలకు జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో సందర్శించాలని, మార్చి రెండున సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.